క్లుప్తంగా

చీరల పంపిణీ



చీరలు అందుకున్న మహిళలతో ఫౌండేషన్ సభ్యులు

వేపాడ: మండలంలోని పెదకృష్ణరాజపురం పంచాయతీ శివారు గదబవలసలో కెజియా ఫౌండేషన్ సభ్యులు గిరిజన మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు బారికి ప్రసాదరావు, గెమ్మలి చిన్నమ్మి,గెమ్మలి అప్పలనాయుడు, తదితరులు మాట్లాడుతూ.. సంస్థ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

రెండు చూడి పశువులు మృతి



మృతి చెందిన చూడి గేదెలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో రెండు చూడి పశువులు శుక్రవారం మృతి చెందాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కింతాడ సత్యారావు కళ్లంలో ఉన్న తన రెండు చూడి గేదెలకు కుడితి పెట్టాడు. అక్కడకు కొద్ది సేపటికి రెండు గేదెలు సొమ్మసిల్లి పడిపోవడంతో పశువైద్యులను రప్పించి వైద్యసేవలు అందించారు. అయితే అప్పటికే రెండు గేదెలు చనిపోయాయి. కుడితిలో యూరియా కలవడం వల్ల పశువులు మృతి చెందినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. సుమారు రెండు లక్షల రూపాయల విలువైన పశువలు చనిపోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్



రేగపుణ్యగిరిలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

శృంగవరపుకోట: నియోజకవర్గంలో వరుసగా నాటు తుపాకులు పేలుతున్నాయి.. దీంతో పోలీసులకు కొత్త తలనొప్పి మొదలైంది. మండలంలో నాటు తుపాకీ పేలుళ్లకు ఒకరు మృతి చెందిన సంఘటన మరువకముందే కొత్తవలసలో మరో వ్యక్తి నాటు తుపాకీకి బలయ్యాడు. అలాగే వల్లంపూడి స్టేషన్ పరిధిలో ఇటీవల నాటు తుపాకీ లభ్యమైంది. దీంతో నియోజకవర్గంలో ఎన్ని నాటు తుపాకీలున్నాయి.. అవి ఎలా వస్తున్నాయో పోలీసులకు అంతు చిక్కడం లేదు. దీంతో ఎస్.కోట సీఐ నారాయణమూర్తి సూచనల మేరకు పోలీసులు రేగపుణ్యగిరి, గిరిలోవ గ్రామాల్లో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉంటే తీసుకునే చర్యలపై ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

నాటు తుపాకులను అప్పగించండి



ఎలుకుల కాలనీలో అవగాహన కల్పిస్తున్న సీఐ శంకరరావు, సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): నాటు తుపాకులు కలిగి ఉండడం నేరమని.. ఒకవేళ ఎవరైనా కలిగి ఉంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని చీపురుపల్లి సీఐ జి.శంకరరావు అన్నారు. గరివిడి మండలంలోని శేరీపేటలో గల ఎలుకల కాలనీలో గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు, గుర్ల ఎస్సై పి.నారాయణరావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సదంర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఎస్పీ వకుల్‌జిందల్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. నాటు తుపాకీలు స్వచ్ఛందంగా అప్పగిస్తే కేసులుండవన్నారు.

ప్రమాదకర మలుపులు



ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపు

మెరకముడిదాం: మండలానికి సుదూర ప్రాంతంలో ఉన్న గొల్లలవలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. పైగా చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వచ్చేయడంతో ఇబ్బందిగా ఉంటోందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు గాని హెచ్చరిక బోర్డులు గాని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అండర్ బ్రిడ్జిలు లేక ఇక్కట్లు..



గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద రైల్వే గేట్ వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

- గోల్డ్‌స్టార్, సంతపేట జంక్షన్ల వద్ద గల రైల్వేగేట్లతో తప్పని అవస్థలు
- గంటల తరబడి గేట్లు వేస్తుండడంతో బారులుతీరుతున్న వాహనాలు
- అరుకు – విశాఖ రోడ్డులో స్తంభిస్తున్న ట్రాఫిక్

లక్కవరపుకోట: కొత్తవలస – కిరండోల్ (కేకే) రైల్వే లైన్‌లో మండలంలోని మల్లివీడు రైల్వేస్టేషన్ సమీపంలో గల గోల్డ్‌స్టార్ జంక్షన్, సంతపేట జంక్షన్ సమీపంలో గల రైల్వేగేట్లతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ లైన్‌లో కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం, మంగళపాలెం, కొత్తవలస, అడ్డుపాలెం, నిమ్మలపాలెం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో రైల్వేశాఖ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీ) నిర్మించింది. అలాగే ఎల్.కోట మండలంలోని గంగుబూడి, జమ్మాదేవిపేట, రంగరాయపురం జంక్షన్‌ల వద్ద.. ఎస్.కోట మండలంలోని దాంపురం, కొత్తూరు జంక్షన్‌ల వద్ద.. కొత్తవలస మండలంలోని సుకంరపాలెం, కంటకాపల్లి రైల్వేస్టేషన్ సమీపాల్లో ఇప్పటికే రైల్వే శాఖాధికారులు అండర్‌బ్రిడ్జిలు నిర్మించారు. అయితే అత్యంత రద్దీగా ఉండే గోల్డ్‌స్టార్ జంక్షన్, సంతపేట జంక్షన్‌ల వద్ద అండర్ బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా అనందపురం నుంచి రేగ, కళ్లేపల్లి, శ్రీరాంపురం, కోనమసివానిపాలెం, తామరాపల్లి, రెల్లిగౌరమ్మపేట, కొత్తపాలెం, తదితర గ్రామాలకు చెందిన వాహనదారులు నిత్యం ఈ జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ జంక్షన్లు రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉండడంతో రైళ్ల రాకపోకల సమయాల్లో గంటల తరబడి గేట్లు పడుతుండడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



గోల్డ్‌స్టార్ జంక్షన్‌కు అర కిలోమీటర్ దూరంలో జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో నిర్మించిన అండర్ బ్రిడ్జి

అంతేకాకుండా స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, మా మహామాయ కర్మాగారాలకు ముడిసరుకు, ఉత్పత్తులను తరలించే భారీ వాహనాలు గేటు వేసిన సమయంలో పెద్ద ఎత్తున బారులు తీరుతున్నాయి. దీంతో అరుకు – విశాఖ రోడ్డులో ట్రాఫిక్ ఎప్పటికప్పుడు స్తంభించిపోతోంది. గేటు పడితే సుమారు అర గంటకు వరకు ఒక్కోసారి గంటకు పైగా నిరీక్షణ తప్పడం లేదని వాహనదారులు చెబుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లేవారికి ఈ గేట్లు శాపంగా మారాయి.

అవసరం ఉన్న చోట లేకుండా..

కిరండోల్ లైన్‌లో అవసరం ఉన్న చోట కాకుండా అంతగా అవసరం లేని చోట రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మించారని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే గోల్డ్‌స్టార్, సంతపేట జంక్షన్‌ల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు లేకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



రైల్వేగేట్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద రైల్వే గేట్ ఎప్పకప్పుడు పడుతుండడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అధికారులు చొరవ చూపి అండర్ బ్రిడ్జి నిర్మించాలి.

– వానపల్లి చెల్లయ్య, బైక్ మెకానిక్, గోల్డ్‌స్టార్ జంక్షన్

ఆర్‌యూబీ నిర్మించాలి



రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మిస్తే సమీప గ్రామాలకు రాకపోకలకు సులభతరం అవుతాయి. జనసంచారం లేని ప్రాంతాల్లో రైల్వే అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉంటే గోల్డ్‌స్టార్, సంతపేట జంక్షన్ల వద్ద ఆర్‌యూబీలు నిర్మించలేదు.

– పినిశెట్టి కిష్టప్పదొర, రెల్లిగౌరమ్మపేట

రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



ఎంపీటీసీ సభ్యురాలు పిల్లా లక్ష్మికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు శైలజ, తదితరులు

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో పలువురు ప్రజాప్రతినిధులకు బ్రహ్మకుమారీస్ శుక్రవారం రాఖీలు కట్టారు. ఎంపీటీసీ సభ్యురాలు పిల్లా లక్ష్మితో పాటు పలువురికి ఎస్.కోట బ్రహ్మకుమారీస్ సెంటర్ ఇన్‌చార్జ్ కె.శైలజ, దివ్య పుష్పలత, తదితరులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ.. రాఖీలు కట్టడం వల్ల భగవంతుడి అనుగ్రహం ఎల్లప్పుడూ మనపై ఉంటుందన్నారు.



ఎస్.కోట: జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

రక్షాబంధన్..

శృంగవరపుకోట: రాఖీ పౌర్ణమి సందర్భంగా స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ ఇన్‌చార్జ్ శైలజ నేతృత్వంలో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దల ఇళ్లకు వెళ్లి రాఖీలు కట్టారు. ఈక్రమంలో ఎస్.కోట జెడ్పీటీసీ సభ్యురాలు మమ్ములూరి వెంకటలక్ష్మికి రాఖీ కట్టారు. కార్యక్రమంలో దివ్య, పుష్పలత, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో అడ్డుకుంటే ఢిల్లీలో పోరాడుదాం..

- కన్స్యూమర్స్ ఫోరం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్‌పాండే

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితులను ఆంధ్రాలో అడుడ్డుకుంటే ఢిల్లీలో పోరాడుదామని వినియోగదారుల హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే అన్నారు. బొడ్డవరలో నిరసనలు చేపడుతున్న నిర్వాసితులను శుక్రవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టాలు చెప్పుకోకుండా బాధితులను అడ్డుకోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడిగా పోరాటం చేస్తున్నారు.. మీకు తప్పకుండా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఇక్కడి ప్రభుత్వం మీ నోరు నొక్కేస్తే, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపడతామని.. ఇందుకు మా సంస్థ అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి మీ భూముల్లో మీరు తిరగలేని దుస్థితి నెలకొనడం కచ్చితంగా మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. ఐకమత్యంతో పోరాటం చేస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, జిందాల్ నిర్వాసితులు పాల్గొన్నారు.



జిందాల్ నిర్వాసితులతో మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు వికాస్‌పాండే

బాబు మోసాలపై ఇంటింట ప్రచారం



జామి: తాండ్రంగిలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపీపీ అరుణ

జామి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను ఎలా మోసం చేస్తున్నదీ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మండలంలోని తాండ్రంగిలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ పథకాలు అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేశామని.. కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఫణిబంగార్రాజు, బి.సంతోష్, వాసు, సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: పెదకాదలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారు

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న మోసాలను ప్రజలందరూ గమనిస్తున్నారని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున అన్నారు. పెదకాదలో స్థానిక పార్టీ నాయకుడు సామిరెడ్డి లక్ష్మణ్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కారు మోసాలను వివరించారు. మేనిఫెస్టోలోని హామీలను ఎందుకు అమలు చేయలేదో నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, సీనియర్ నాయకులు మహాదేవ్ ఫణీంద్రుడు, సుమల గోవిందు, మండల శ్రీను, పలు గ్రామాలు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



స్కూల్ కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్న హెచ్‌ఎం ఈశ్వర అప్పారావు

కొత్తవలస: మండలంలోని రెల్లి గ్రామ పంచాయతీ శివారు ముమ్మనవానిపాలెం ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవమైనట్లు హెచ్‌ఎం ఈశ్వర అప్పారావు తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా అమరపల్లి చిన్నస్వామి, ముమ్మన రేవతి, మెంబర్లుగా పలువురు ఎంపికయ్యారని చెప్పారు. ఈ పాఠశాలలో గతేడాది ఒకే విద్యార్థి ఉండగా 5వ తరగతి పాస్ కావడంతో ఆ విద్యార్థి హైస్కూల్‌కి వెళ్లిపోయాడు. దీంతో పాఠశాల మూతపడే స్థితికి చేరుకుంది. దీంతో గ్రామ పెద్దలు సమావేశమై ఒక పర్యాయం పాఠశాల మూతపడితే మరలా పాఠశాల మంజూరయ్యే అవకాశం ఉండదని అధికారులు చెప్పడంతో తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ముందుకొచ్చారు. దీంతో పాఠశాలలో 16 మంది విద్యార్థులు చేరారు. గతంలో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించే సమయంలో విద్యార్థులు లేకపోవడంతో అప్పుడు ఎన్నికలు నిర్వహించ లేదని హెచ్‌ఎం తెలిపారు. ప్రస్తుతం పిల్లలు చేరడంతో ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సర్వశక్తులా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.జగదీష్, మాజీ సర్పంచ్ బోగాది జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని వైద్య సిబ్బంది

మెరకముడిదాం: గ్రామాల్లో రాత్రి వేళల్లో అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు స్థానికంగా వైద్యసేవలు అందాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో నిబంధనల ప్రకారం ఏఎన్‌ఎంలు రాత్రి సమయంలో అందుబాటులో ఉండాలి. సిబ్బంది ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ హెల్త్ క్లినిక్‌లలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేశారు. అయితే మొదట్లో వైద్యాధికారుల సూచనలు మేరకు ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హెల్త్ క్లినిక్‌లలో ఏఎన్‌ఎంలు పగటిపూట మాత్రమే అందుబాటులో ఉండి, రాత్రి తమ ఇళ్లకు వెళ్లిపోతున్నారు. దీనిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గొల్లలవలస విలేజ్ హెల్త్ క్లినిక్

శ్రావణలక్ష్మీ నమోస్తుతే...

శ్రావణమాసంలో శ్రావణలక్ష్మిని (వరలక్ష్మి) పూజించడం వల్ల సకల శుభాలూ కలుగుతాయని భక్తుల నమ్మకం. మూడో శుక్రవారం కావడంతో వాడవాడలా వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు చేశారు. అలాగే ఇళ్లల్లో కూడా మహిళలు తమ శక్తి కొద్దీ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ప్రసాదాలు నైవేద్యంగా పెట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: గాజుల అలంకరణలో కనక మహాలక్ష్మి



చీపురుపల్లి: ప్రత్యేక అలంకరణలో మానసాదేవి నాగశక్తి



బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చీపురుపల్లి: కనక మహాలక్ష్మి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



మెరకముడిదాం: వరలక్ష్మీవ్రతం సందర్భంగా లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: అమ్మవారికి పిండి వంటలు, పండ్లతో నైవేద్యం



గజపతినగరం: పూజలందుకుంటున్న వరలక్ష్మి



శృంగవరపుకోట: వరలక్ష్మీదేవిగా దుర్గమ్మ



జామి: పూజలందుకుంటున్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారు

బోరుబావి ఏర్పాటు చేయరూ..

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం జంక్షన్ వద్ద నిత్యం వందలాది మంది ప్రయాణికులు వేచి ఉంటారని, వారి దాహార్తి తీర్చేందుకు బోరు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. సోమలింగాపురం గ్రామానికి చెందిన దాతలు షెల్టర్ నిర్మించడంతో అందరూ అక్కడే వేచి ఉంటారు. అయితే అత్యవసర సమయంలో దాహం వేస్తే మాత్రం అటు మెరకముడిదాం గాని, ఇటు సోమలింగాపురం గాని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి జంక్షన్‌లో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వాసవీమాతకు సారె సమర్పణ

విజయనగరం టౌన్: వాసవీ కన్యకపరమేశ్వరీ అమ్మవారి దేవాలయానికి పట్టు వస్త్రాలు, 52 రకాల పిండి వంటలతో వాసవీక్లబ్ విజయనగరం అధ్యక్షులు విజ్జపు విజయ్ చీర, సారె కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలో క్లబ్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆలవెల్లి శేఖర్, ఎవి.కృష్ణారావు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, డిమ్స్ రాజు, కట్టమూరి శంకరరావు, గుడిశా వినోద్, రత్నారావు పాల్గొన్నారు.